వచ్చే ఎన్నికల్లోనూ జగనన్నను గెలిపించాలి


జంగారెడ్డిగూడెం మండల గృహసారథులు, సచివాలయాల కన్వీనర్ల శిక్షణలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎలీజా


పట్టణ గృహసారథులు, సచివాలయాల కన్వీనర్‌ల శిక్షణలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా

- చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా
- సచివాలయ కన్వీనర్‌లు, గృహసారథులకు దిశా నిర్దేశం

జంగారెడ్డిగూడెం : సచివాలయ కన్వీనర్‌లు, గృహసారథులే రానున్న ఎన్నికలో జగనన్న సైనికులని చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తామే జగనన్న సైనికుడిననే చిత్తశుద్ధితో పని చేసి వైఎస్సార్ సీపీ విజయానికి కృషిచేసి జగనన్నను మళ్లీ సీఎంను చేయాలని ఎలీజా పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఆలపాటి గంగాభవానీ కళ్యాణ మండపంలో జంగారెడ్డిగూడెం పట్టణ పరిధిలో, మండల పరిధిలో 'మా నమ్మకం నువ్వే జగనన్న' కార్యక్రమంలో భాగంగా సచివాలయాల కన్వీనర్‌లు, గృహసారథుల శిక్షణా కార్యక్రమం విడివిడిగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎలీజా మాట్లాడుతూ సచివాలయ కన్వీనర్‌లు, గృహసారథుల ఆలోచన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అద్భుత ఆలోచన అని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో 44 నెలల్లో రూ. 1.19 లక్షల కోట్ల నిధులు సంక్షేమ పథకాలకు వెచ్చించారన్నారు. రాష్ట్రంలో 80శాతం ప్రజలకు సంక్షేమ పథకాలు అందాయన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రపంచమే రాష్ట్రం వైపు చూసేలా సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. ఇప్పటి వరకు చరిత్రలో మేనిఫెస్టోను ఒక బైబిల్, ఒక ఖురాన్, ఒక భగవద్గీతలా భావించి నూరుశాతం హామీలు అమలుచేసిన ఘనత సీఎం జగన్‌దే అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మహిళా పక్షపాతి అని పేర్కొన్నారు. ఇటువంటి ప్రభుత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని, తిరిగి జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేయడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సైనికుడిలా పోరాడాలన్నారు. లక్ష్యసాధన కోసం సచివాలయ కన్వీనర్‌లు, గృహసారథులను ఏర్పాటు చేశారన్నారు. గృహ సారథులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం ఇప్పటి వరకు చేసిన సంక్షేమాన్ని వివరించడమే కాకుండా రానున్న కాలంలో చేపట్టే పథకాలు కూడా వివరించాలని ఎమ్మెల్యే సూచించారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి రాష్ట్రాన్ని ప్రగతిపథం వైపు తీసుకువెళుతున్న జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుతాన్ని చూసి ఓర్వలేక దుష్ట చతుష్టయం లేనిపోని ఆరోపణలు, దుష్ప్రచారాలు చేస్తున్నాయని ధ్వజమెత్తారు. సరిగా నడవడం చేతగాని వాడు కూడా జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించడం హాస్యాస్పదం అన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఏ విధంగా పనిచేయాలో ఎమ్మెల్యే వివరించారు. కార్యక్రమంలో పట్టణ , మండల కమిటీల అధ్యక్షులు పీపీఎన్‌చంద్రరావు, వామిశెట్టి హరిబాబు, ఎంపీపీ కొదమ జ్యోతి, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, ఉభయగోదావరి జిల్లా బూత్ కమిటీల కో-ఆర్డినేటర్ బీవీఆర్ చౌదరి, ఐసీడీఎస్ రీజనల్ చైర్‌పర్సన్ వందనపు సాయిబాల పద్మ, మేడవరపు విద్యాసాగర్, పట్టణ, మండల సచివాలయాల కన్వీనర్‌లు చనమాల శ్రీను, గురజాల పార్థసారథి, మున్సిపల్ వైస్‌చైర్మన్‌లు కంచర్ల వాసవీ రత్నం, ముప్పిడి అంజి, వైస్ ఎంపీపీ నరెడ్ల బుబ్జి, బత్తిన చిన్న, వందనపు వెంకటేశ్వరరావు, షేక్ అక్బర్, జిలాని, కౌన్సిలర్‌లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సొసైటీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వీయ రక్షణ, నైతిక విలువలపై అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

కామవరపుకోట : స్థానిక ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రవీంద్ర అధ్యక్షతన బుధవారం జిల్లా మానవత స్వచ్ఛంద సంస్థ, స్థానిక తడికలపూడి పోలీస్ విభాగం వారి సహకారంతో కళాశాల విద్యార్థులకు స్వీయ రక్షణ, నైతిక విలువల ఆవశ్యకత అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ కె.రవీంద్ర మాట్లాడుతూ విద్యార్థులందరూ క్రమశిక్షణతో విద్య అభ్యసిస్తూ నైతిక విలువలను పెంపొందించుకొని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని అన్నారు. జిల్లా కెరీర్ గైడెన్స్ కన్వీనర్, ప్రముఖ సైకాలజిస్ట్ అంబటి జయలక్ష్మి విద్యార్థులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగుతూ మానసిక ఒత్తిడిని అధిగమించాలన్నారు. తడికలపూడి ఏఎస్సై స్వామి వివిధ చట్టాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆడమిల్లి సర్పంచ్ జి.కేశవరావు, జిల్లా మానవతా చైర్మన్ గంగాధర్, అధ్యాపకులు ఎం.మల్లేశ్వరరావు, రామ్మోహన్, డి.మల్లేష్, వి.శ్రీనివాస్, హర్షవర్ధిని, నజ్మా, పాల్గొన్నారు.

కన్నెగంటి జయంతిని అధికారికంగా నిర్వహించాలి


కన్నెగంటికి నివాళి అర్పిస్తున్న కాపు సంఘం నేతలు

కొయ్యలగూడెం : ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు పుల్లరి ఉద్యమ కారుడు కన్నెగంటి హనుమంతు జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కాపు సంఘం కోరింది. స్థానిక గణేష్ సెంటర్‌లో కాపునేత చోడిపిండి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో బుధవారం కన్నెగంటి హనుమంతు జయంతి కార్యక్రమం నిర్వహించారు. జాతిపిత మహాత్మా గాంధీ ప్రేరణతో సహాయ నిరాకరణ ఉద్యమాన్ని నిర్వహించడంతోపాటు నాటి గుంటూరు జిల్లా పల్నాడులో పుల్లరి ఉద్యమాన్ని ధీరోధాతంగా నిర్వహించి బ్రిటిష్ పాలకుల గుండెల్లో గుబులు పుట్టించారన్నారు. విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు సైతం తనకు కన్నెగంటి హనుమంతు స్ఫూర్తిగా నిలిచినట్లు స్వాతంత్రోద్యమ చరిత్రలో పేర్కొన్నారని, అటువంటి మహానీయుని ప్రజలు స్మరించుకునేలా ప్రభుత్వం కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. ఈ సందర్భంగా కన్నెగంటి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కాపు సంఘం నేతలు మేకల అన్నవరం, దుగ్గిన శ్రీను, సంకు మధు, సంకుకొండ, ఐవి అప్పారావు, మేడిన కన్నయ్య, కూచిమంచి శ్రీనివాస్ నాయుడు, నక్కా బాబి, సింగలూరి సాగర్‌బాబు, వీరాస్వామి, నాని, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి, గ్రావెల్ తరలివస్తే చర్యలు


ధర్మాజీగూడెం చెరువులో మట్టి తరలించిన గోతులను పరిశీలిస్తున్న అధికారులు

లింగపాలెం : చెరువుల నుంచి అక్రమంగా మట్టి, గ్రావెల్ తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ మురళీకృష్ణ, ఏలూరు జిల్లా ఇరిగేషన్ డీఈ అర్జునరావు హెచ్చరించారు. బుధవారం మండలంలోని ధర్మాజీగూడెం మల్లసముద్రం చెరువుతోపాటు గ్రామంలోని ఇతర చెరువులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధర్మాజీగూడెం మల్లసముద్రం చెరువు నుంచి మట్టి తోలకాలకు సంబంధించి ఎటువంటి అనుమతులు ఇవ్వలేదన్నారు. అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి, గ్రావెల్ తరలిస్తే చట్టప్రకారం జేసీబీ, ట్రాక్టర్లను సీజ్ చేసి ఒక్కొక్క వాహనానికి రూ.లక్ష చొప్పున జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఇందుకోసం రెవెన్యూ, ఇరిగేషన్, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక టీంలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలకు మట్టి కావల్సిన లబ్ధిదారులు ఆయా గ్రామ పంచాయతీల నుంచి తీర్మానం, తహసీల్దార్ నుంచి పర్మిషన్ లెటరు తీసుకొని ప్రభుత్వానికి నగదు చలానా చెల్లించి రసీదు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ధర్మాజీగూడెం ఎస్సై పి.చెన్నారావు, ఆర్ఐ, వీఆర్వోలు ఉన్నారు.

ఫ్యాక్టరీ యాజమాన్యం రైతులకు నష్టపరిహారం చెల్లించాలి


పరిశ్రమ వద్ద దెబ్బతిన్న మొక్కజొన్న పంటను చూపుతూ నిరసన తెలుపుతున్న లింగరాజు, తదితరులు

ద్వారకాతిరుమల : మండలంలోని తిమ్మాపురం గ్రామ శివారులోని సాత్‌స్టార్ సిరామిక్ పరిశ్రమ నుంచి విడుదలౌతున్న కాలుష్యం కారణంగా ఆ ప్రాంతంలోని 20 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న పలు రకాలు పంటలు తీవ్రంగా దెబ్బతిని, రైతులు నష్టపోతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆర్.లింగరాజు అన్నారు. బుధవారం ఆయన దెబ్బతిన్న మొక్కజొన్న పంటలను బాధిత రైతులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా లింగరాజు మాట్లాడుతూ స్థానిక సిరామిక్ పరిశ్రమ కాలుష్య నియంత్రణ మండలి నియమ నిబంధనలను గాలికొదిలేసి, కాలుష్యాన్ని రైతుల పంట పొలాల్లోకి వదిలేసిందన్నారు. దీని కారణంగా నిమ్మ, మొక్కజొన్న రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. గత మూడేళ్లుగా తమ సమస్యను ఫ్యాక్టరీ యజమాన్యానికి ఎన్నిసార్లు విన్నవించినా సమస్య నేటికీ పరిష్కారం కాకపోవడం దారుణమన్నారు. గత రెండేళ్లుగా కాలుష్యం కారణంగా పంటలు పండక 20 మంది రైతులు లక్షలాది రూపాయలను నష్టపోయారని, వెంటనే వారికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బాధిత కౌలు రైతులు పెండ్లి గాంధి, బొక్కా సత్యన్నారాయణ మాట్లాడుతూ వేలాది రూపాయలు కౌలు చెల్లిస్తూ, సాగుకు పెట్టుబడులు పెట్టి నష్టపోతున్న తమకు వెంటనే ఫ్యాక్టరీ యాజమాన్యం నష్టపరిహారం చెల్లించాలని, లేకుంటే ఆందోళన తప్ప తమకు మరో మార్గం లేదన్నారు. అనంతరం ఫ్యాక్టరీ గేటు ముందు రైతులతో కలసి లింగరాజు కొద్దిసేపు నిరసన తెలిపారు.

రహదారి అభివృద్ధి కోరుతూ గ్రామస్తుల ఆందోళన


ప్రధాన రహదారిపై ఆందోళన నిర్వహిస్తున్న సీపీఐ శ్రేణులు

కొయ్యలగూడెం : మంగపతిదేవిపేట గ్రామంలో రోడ్లు నిర్మించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో గ్రామస్తులు బుధవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏజెన్సీ గ్రామాల నుంచి కొయ్యలగూడెం రావాలంటే మంగపతిదేవిపేట గ్రామం మీదుగానే నిత్యం వందలాది మంది రాకపోకలు కొనసాగిస్తున్నారని అన్నారు. గ్రామంలో ఉన్న ప్రధాన రహదారిపై పెద్ద పెద్ద గోతులు ఏర్పడడంతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని, గ్రామంలో డ్రెయినేజీ సమస్య కూడా ఎక్కువగా ఉన్నందున ఇళ్లల్లో వాడిని నీరు డ్రెయినేజీ లేక రోడ్లపైనే ఏరులై పారుతుందని సంబంధిత అధికారులు మంగపతిదేవిపేట గ్రామ అభివృద్ధికి సహకరించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో గుదే శ్రీను, దాసరి సుందరరావు, కట్ట మహేష్, శుక్లబోయిన వెంకటేష్, అగ్గయ్య, జక్కు కొవ్వాడియ్య, బుర్రి బాబి, బి. సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి చూపాలి


ఎల్ఎన్‌డీపేటలో ప్రకృతి వ్యవసాయంపై నిర్వహిస్తున్న అవగాహన ర్యాలీ

పోలవరం రూరల్ : పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయంపై రైతులు ఆసక్తి చూపాలని మాస్టర్ ట్రైనర్ వి.జ్యోతిర్మయి తెలిపారు. పోలవరం మండలం ఎల్ఎన్‌డీపేట గ్రామంలో రైతులు, గ్రామస్తులు, పాఠశాల విద్యార్థులతో కలిసి ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులందరూ ప్రకృతిలో దొరికే వాటితో కషాయాలు తయారు చేసుకుని పంటలకు వాడితే చీడ పీడల నివారణకు ఉపయోగపడుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయ వారోత్సవాల్లో భాగంగా ప్రదర్శనలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కాలం రసాయనిక ఎరువులు, పురుగు మందులు ఎక్కువగా వాడటం వల్ల భూమి, నీరు, గాలి కలుషితమై భూమిపై నివశిస్తున్న మానవాళి ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతుందన్నారు. ఖరీఫ్‌కు ముందు అనేక రకాల చిరుధాన్యాలు వేయడం వల్ల భూసారం పెరిగి పంటకు పోషకాలు అందుతాయని, ఈ విషయాన్ని రైతులందరూ కూడా అర్థం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు నార్గాని పోసిబాబు, కొల్లేపర రామబ్రహ్మం, ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలు పూసం సత్తిబాబు, కె.కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రమాదబీమా అమలు చేయాలి



యూనియన్ సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

కుక్కునూరు : మధ్యాహ్న భోజన కార్మికులకు మెనూ చార్జీలు పెంచాలని, ప్రమాద బీమా అమలు చేయాలని ఏపీ మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ (సీఐటీయూ) జిల్లా కార్యదర్శి మొడియం నాగమణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ సమావేశం బుధవారం గంగమ్మ అధ్యక్షతన ప్రజాసంఘాల కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాగమణి మాట్లాడుతూ ప్రమాద బీమా అమలు చేయాలని, మార్కెట్ రేటుకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచి ఇవ్వాలని, గుర్తింపు కార్డులు, కాటన్ యూనిఫామ్ ఇవ్వాలని, ప్రతి సంవత్సరం వర్కర్‌ని మార్చకుండా ఒక్కరినే కొనసాగించాలని కోరారు. ఈ సమావేశంలో సీఐటీయూ కుక్కునూరు మండల కార్యదర్శి కుంజా నాగలక్ష్మి, యర్నం సాయికిరణ్, మధ్యాహ్న భోజన కార్మికులు పుష్ప, చిట్టెమ్మ, గంగమ్మ, ఉమ, దుర్గమ్మ తదితరులు పాల్గొన్నారు.

అన్నసమారాధన

బుట్టాయగూడెం : మహా శివరాత్రి మహోత్సవాల సందర్భంగా చివరిరోజు బుధవారం స్థానిక త్రిపుర సుందరీ సమేత కామేశ్వరస్వామివారి ఆలయంలో ఘనంగా అన్నసమారాధన నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. శివరాత్రి మహోత్సవాలు ఐదు రోజులపాటు ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆలయ ధర్మకర్త గొట్టుముక్కల చిట్టిరాజు కృతజ్ఞతలు తెలిపారు.

ఉత్సాహంగా పెయ్యదూడల ప్రదర్శన పోటీలు


ధర్మాజీగూడెంలో పెయ్యదూడల ప్రదర్శనలో దూడలను పరిశీలిస్తున్న పశువైద్యాధికారులు

లింగపాలెం: పెయ్యదూడలను శాస్త్రీయ పద్ధతిలో పోషించినట్లయితే మంచి పాడిపశువులుగా అభివృద్ధి చేసుకోవచ్చని డిస్ట్రిక్స్ లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ డీడీ జేసురత్నం అన్నారు. మండలంలోని ధర్మాజీగూడెం పశువైద్యశాలలో పెయ్యదూడల ప్రదర్శన పోటీలను పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ ప్రదర్శన పోటీలకు 63 పెయ్యదూడలతో రైతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జేసురత్నం మాట్లాడుతూ శాస్త్రీయ పద్ధతిలో పెయ్యదూడలను ఎలా పెంచాలో రైతులకు అవగాహన కల్పించారు. పెయ్యదూడల ఉత్పత్తి పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పెయ్యదూడల వల్ల పాడిపరిశ్రమను అభివృద్ధి చేసుకుని రైతులు ఆర్థికాభివృద్ధిని సాధించాలన్నారు. ఈ ప్రదర్శనలో మఠంగూడెం గ్రామానికి చెందిన మండలపు వీరవెంకట సత్యన్నారాయణ పెయ్యదూడ ప్రథమస్థానం సాధించగా, ధర్మాజీగూడెం గ్రామానికి చెందిన రైతు ఉప్పు శివయ్య దూడ ద్వితీయ స్థానం, మఠంగూడెం గ్రామానికి చెందిన గంటా మురళీరామకృష్ణ దూడ తృతీయ స్థానం సాధించినట్లు అధికారులు ప్రకటించారు. విజేత దూడల రైతులకు అధికారులు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఇతర రైతులకు కన్సొలేషన్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏడీ టీఆర్‌కే ప్రసాదరావు, డాక్టర్ చైతన్య, డాక్టర్ ఎల్.రామకృష్ణ, డాక్టర్ డి.ఆదిత్య, డాక్టర్ శివనాగేంద్ర, డాక్టర్ సుప్రియ, సిబ్బంది మోహన్, పోతుల గోపాల్ పాల్గొన్నారు.

సీపీఐ ఎంఎల్ ప్రజాపందా ఆవిర్భావ దినోత్సవం

కుక్కునూరు : సీపీఐ ఎంఎల్ ప్రజాపందా ప్రథమ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం కుక్కునూరు మండల పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ ఎంఎల్ ప్రజాపందా జంగారెడ్డిగూడెం డివిజన్ కార్యదర్శి షేక్ గౌస్ మాట్లాడుతూ సీపీఐ ఎంఎల్ ప్రజాపందా ఆవిర్భవించి నేటికి ఏడాది పూర్తయిందన్నారు. ప్రజాపందా ఆధ్వర్యంలో అణగారిన వర్గాల కోసం పోరాటాలు చేయనున్నట్లు చెప్పారు. అన్ని గ్రామాలలో పార్టీ నాయకులు జెండా ఎగరవేశారు.

ప్రపంచ స్కౌట్ దినోత్సవం

కామవరపుకోట : రావికంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కౌటింగ్ వ్యవస్థాపకుడు రాబర్ట్ బాడెన్-పావెల్ జన్మదినోత్సవం సందర్భంగా ప్రపంచ స్కౌట్ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. బాడెన్ పావెల్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయులు ఉమ్మడి భీమరాజు, స్కౌట్ మాస్టర్ బిరుదుగడ్డ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కోడిపందేలపై దాడి

పోలవరం రూరల్ : ఎల్ఎన్‌డీపేటలో కోడిపందేలపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని మూడు కోళ్లు, రూ.1900 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ తెలిపారు.

మొక్కజొన్న పంట ధ్వంసంపై కేసు నమోదు

పట్టిసం గ్రామంలోని 78 సెంట్ల పొలంలో మొక్కజొన్న పంట వేశానని, ఆ పంటను ఈ నెల 19వ తేదీన గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని పందిటి సూర్యనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ పొలం కోర్టు వివాదంలో ఉందన్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు.

క్లుప్తంగా

క్రైస్తవ దీక్షలు ప్రారంభం


గవరవరం ఆర్‌సీఎం చర్చి వద్ద దీక్షాధారణ చేపట్టిన క్రైస్తవ విశ్వాసులు

కొయ్యలగూడెం : గుడ్‌ఫ్రైడే పురస్కరించుకుని ఐసమ దీక్షలు బుధవారం నుంచి మండల వ్యాప్తంగా ఉన్న చర్చిల వద్ద ప్రారంభం అయ్యాయి. గవరవరం ఆర్‌సీఎం చర్చి వద్ద క్రైస్తవ సోదరులు 150 మంది గవరవరం విచారణ గురువు ఫాదర్ శౌరి ఆధ్వర్యంలో క్రైస్తవమాలను ధరించారు. 40 రోజులపాటు భక్తి శ్రద్ధలతో ఉపవాస దీక్షలు చేపట్టి 41వ రోజు దీక్షను విరమిస్తారని ఆర్‌సీఎం చర్చి పాస్టర్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్‌సీఎం విచారణ పరిధిలోని వివిధ గ్రామాలలో ప్రత్యేక ప్రార్థనలు, సిలువ జ్ఞానాలు నిర్వహిస్తామని ఫాదర్ శౌరి తెలిపారు. కార్యక్రమంలో సంఘ కాపర్లు సంఘ విశ్వాసులు పాల్గొన్నారు.

జడ్జి షరీఫ్‌కు సత్కారం


జూనియర్ సివిల్ జడ్జి షేక్ ఇబ్రహీం షరీఫ్‌ను సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు


చింతలపూడి : జూనియర్ సివిల్ జడ్జి షేక్ ఇబ్రహీం షరీఫ్ అందించిన సేవలు ఆదర్శనీయమని పలువురు కొనియాడారు. చింతలపూడి కోర్టు నుంచి ఒంగోలు కోర్టుకు బదిలీ అయిన షరీఫ్‌కు బుధవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయవాదులు జూనియర్ సివిల్ జడ్జి షరీఫ్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బార్‌అసోసియేషన్ అధ్యక్షులు నరుకుళ్ళ సత్యన్నారాయణ, మాజీ క్యాలరావు, సీఐ ఎంవీఎస్ మల్లేశ్వరరావు, ఎస్సైలు, న్యాయవాదులు పాల్గొన్నారు.

దాతకు సత్కారం


దాత కుటుంబ ప్రతినిధి తేజశ్రీని సత్కరిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : రోటరీ సేవా కార్యక్రమాల్లో భాగంగా స్థానిక సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంచినీటి వ్యవస్థకు రక్షణగా శాశ్వత ప్రాతిపదికన ఇనుపగ్రిల్‌ను ఏర్పాటు చేశారు. మక్కినవారిగూడెంకు చెందిన చెన్నకేశవ టూర్స్ అండ్ ట్రావెల్స్ కలిదిండి రామ సత్యవతి ఇందుకోసం రూ.16 వేలు విరాళం అందించారు. ప్రారంభోత్సవంలో పాల్గొన్న దాత కుటుంబ సభ్యులు కలిదిండి తేజశ్రీని ఈ సందర్భంగా సత్కరించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు దాతకు, రోటరీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. రోటరీ కార్యదర్శి ఉడా రాంగోపాల్(గోపీ), రోటరీ ప్రతినిధులు కేవీఎన్ ధనకుమార్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఏసు దీక్షను స్వీకరించిన విశ్వాసులు


రాళ్లకుంటలో ఏసు దీక్షను స్వీకరించిన విశ్వాసులు

ద్వారకాతిరుమల: రాళ్లకుంట ఫాతిమామాత విచారణ ప్రాంగణంలోని భవనం వద్ద పలువురు విశ్వాసులు బుధవారం భక్తిశ్రద్ధలతో ఏసు దీక్షను స్వీకరించారు. ఫాదర్ చార్లెస్ కాకి వారికి మాలలు వేశారు. ఈ సందర్భంగా చార్లెస్ కాకి మాట్లాడుతూ 40 రోజుల దీక్షను చేపట్టిన విశ్వాసులు ఉపవాసం చేయడం, వాక్యం చదువుకోవడం, దానధర్మాలు చేయడం, ప్రార్థనల్లో పాల్గొనడం, దేవుని ఆజ్ఞాను సారం దశమభాగం చెల్లించడం ద్వారా దేవుని దీవెనలను పొందవచ్చున్నారు. కార్యక్రమంలో సీహెచ్ పోతేపల్లి, కోడిగూడెం, మద్దులగూడెం, సాయన్నపాలెం, వెంకటకృష్ణాపురం, దొరసానిపాడు గ్రామాలకు చెందిన సంఘ విశ్వాసులు, ఉపదేశులు పాల్గొన్నారు.

తాడువాయిలో ముగిసిన శివరాత్రి ఉత్సవాలు

జంగారెడ్డిగూడెం రూరల్ : తాడువాయి శ్రీభద్రకాళి సమేత వీరేశ్వరస్వామి వారి క్షేత్రంలో జరుగుతున్న మహా శివరాత్రి కల్యాణ మహోత్సవాలు బుధవారంతో ముగిశాయి. స్వామి, అమ్మవారికి శ్రీపుష్పయాగం (పవళింపుసేవ) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా వీరేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం అర్చకులు ఆశీర్వచనాలు అందజేసి, స్వామి వారి ప్రసాదాన్ని అందజేశారు. జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, సర్పంచ్ యరమాల సత్యవతి, ఉత్సవ కమిటీ చైర్మన్ పాపోలు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ డ్రాపవుట్స్ విద్యార్థులకు అవకాశం

జంగారెడ్డిగూడెం : ఇంటర్మీడియేట్ డ్రాపవుట్స్ విద్యార్థులు సార్వత్రిక విద్యావిధానం ద్వారా ఇంటర్మీడియేట్ పూర్తిచేసేందుకు ఏపీ ఇంటర్ బోర్డు ఈనెల 27వరకు అడ్మిషన్లకు అవకాశం కల్పించినట్లు దామోదరం సంజీవయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బి.వెంకటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల డ్రాపవుట్స్ విద్యార్థులు ఈ నెల 27వ తేదీ లోపు 10వ తరగతి ఒరిజినల్ మార్కులిస్ట్, కులధృవీకరణ పత్రం, ఒక పాస్‌పోర్టుసైజు ఫోటోతో కళాశాలలో సంప్రదించాలన్నారు. అడ్మిషన్‌లు పొందిన విద్యార్థులకు శిక్షణ ద్వారా ఏప్రిల్ నెలలో సార్వత్రిక విద్యావిధానం ద్వారా పరీక్షలు నిర్వహిస్తారన్నారు.

తాగునీటికి రూ.3 లక్షలు మంజూరు


గవరవరం గ్రామంలో స్థానికలతో మాట్లాడుతున్న ఎంపీపీ

కొయ్యలగూడెం : గవరవరం గ్రామంలో నెలకొన్న తాగునీటి ఎద్దడి సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే తెల్లం బాలరాజు స్పందించినట్లు ఎంపీపీ గంజిమాల రామారావు పేర్కొన్నారు. సాక్షి దినపత్రికలో ఈనెల 18వ తేదీన 'గవరవరం గ్రామంలో తాగునీటి ఎద్దడి శీర్షిక'న ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించి మండల పరిషత్తు నిధులు రూ. 3 లక్షలు వెచ్చించి తాగునీటి వనరుల కల్పనకు కృషి చేయాలని ఆదేశించారన్నారు. ఈ నేపథ్యంలో ఎస్సీ ఏరియాలో పర్యటించి స్థానికుల తాగునీటి సమస్యలను అడిగి తెలుసుకుని త్వరలోనే సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఎంపీటీసీ బిరుదుగడ్డ రత్నకుమారి, గ్రామ కమిటీ అధ్యక్షుడు చీమకుర్తి సత్యనారాయణ, గ్రామ పార్టీ నాయకులు గంటా రమేష్, బిరుదుగడ్డ ప్రేమ్ కుమార్, మిరియాల వెంకటపతి, దూలపల్లి రాయిడు, మాజీ ఎంపీటీసీ బల్లే కుమారి, తగరం ధర్మయ్య పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజిషియన్ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


పుప్పాలవారిగూడెంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న డాక్టర్ యాని ప్రీతీ

లింగపాలెం : ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండేలా ప్రభుత్వం నిర్వహిస్తున్న ఫ్యామిలీ ఫిజిషియన్ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ యాని ప్రీతీ అన్నారు. బుధవారం కె.గోకవరం పీహెచ్‌సీ పరిధిలోని పుప్పాలవారిగూడెం ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈమేరకు డాక్టర్ యాని ప్రీతీ రోగులకు బీపీ, షుగర్ తదితర పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఆహార నియమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గర్భిణీలు, బాలింతలకు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ అబ్రార్, గ్రామ కార్యదర్శి అశోక్, హెచ్ఎస్ ఉమా మహేశ్వరావు, ఎంఎల్‌హెచ్ పి శ్రీవల్లి, హెల్త్ అసిస్టెంట్ బి.చంద్రశేఖర్, ఏఎంఎం హేమలత, డీఈఓ వెంకన్నబాబు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

నేడు విశిష్ట సేవా పురస్కారాలు ప్రదానం

జంగారెడ్డిగూడెం : పట్టణంలోని చైతన్య కళావేదిక ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న వారికి విశిష్ట సేవా పురస్కారాలు అందించనున్నట్లు కళావేదిక వ్యవస్థాపకులు జొన్నకూటి వెంకటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం సాయంత్రం 7గంటలకు స్థానిక ఎంబీ సోషల్ క్లబ్ ప్రాంగణంలో స్వర్గీయ చీమకుర్తి నాగేశ్వరరావు, బండారు రవికుమార్ 17వ వర్ధంతి సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభలో వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న ప్రముఖులు ఎండీ మౌలా, గణిత ఆనంద ప్రసాద్, కాసర లక్ష్మీ సరోజారెడ్డి, జవ్వాజి ఉమా వెంకటేష్, ఉక్కుర్తి సీతారాం, కనుపర్తి వెంకట సింహాద్రిలకు విశిష్ట సేవాపురస్కారాలు అందించనున్నామని తెలిపారు. లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్ పంతగాని వెంకన్న అధ్యక్షతన జరిగే ఈ సభలో ముఖ్యఅతిథిగా డీఎస్పీ కేవీ సత్యనారాయణ పాల్గొంటారన్నారు.